నాగాయపల్లెలో ఘనంగా సీతారాముల కల్యాణం

చాపాడు : మండలంలోని నాగాయపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించిన రామాలయ ప్రతిష్టా వేడుకలు గత మూడు రోజులుగా నిర్వహించారు. చివరి రోజైన ఆదివారం సీతారామలక్ష్మ హనుమత్ సమేత విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు నిర్వహించిన సీతారాముల కల్యాణంలో గ్రామ ప్రజలందరూ పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఇదే క్రమంలో మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి, మాజీ మంత్రులు డీఎల్ రవీంద్రారెడ్డి, మాజీ మంత్రి ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు వరదరాజులరెడ్డి, లింగారెడ్డి, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పుట్టా సుధాకర్ యాదవ్, మండల చాపాడు ఎంపీపీ తెలిదేల లక్షుమయ్య, జెడ్పీటీసీ శాంతరాజు, మైదుకూరు మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీమన్నారాయణరెడ్డి, ఆర్టీసీ రీజనల్ మాజీ చైర్మన్ రెడ్యం వెంకట సుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ గ్రామ సచివాలయ కన్వీనర్ రామోహన్ రెడ్డి, మాజీ సర్పంచ్ రామోహన్‌రెడ్డి, సోమాపురం సర్పంచ్ శ్రీనివాసులరెడ్డి హాజరయ్యారు. స్థానిక గ్రామ నాయకుడు, మాజీ ఎంపీపీ వెంకటసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో అతిథులను సన్మానించారు.

ఉత్సాహంగా బండలాగుడు పోటీలు

మండలంలోని నాగాయపల్లె గ్రామంలో రామాలయ విగ్రహ ప్రతిష్ట వేడుకల సందర్భంగా ఆదివారం నిర్వహించిన బండలాగుడు పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం జరిగిన పోటీల అనంతరం బండ విరిగిపోవడంతో మధ్యాహ్నం నుంచి మరో బండతో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో రెండు విభాగాల్లో గెలుపొందిన ఎద్ల యజమానులకు వేర్వేరుగా నగదు బహుమతులు అందజేశారు. ఉదయం నిర్వహించిన పోటీల్లో మైదుకూరుకు చెందిన కుర్ర వెంకటేష ఎద్లు 2870.7 అడుగులతో ప్రథమ స్థానంలో నిలిచాయి. లింగాయపల్లెకు చెందిన పులవుల సురేష యాదవ్ ఎద్లు 2823.5 అడుగులతో ద్వితీయ స్థానం, బాలయ్యగారిపల్లెకు చెందిన నంద్యాల విష్ణువర్ధన్ ఎద్లు 2655 అడుగులతో తృతీయ స్థానం, కలసపాడుకు చెందిన బేతి వెంకటరెడ్డి ఎద్ల 2200 అడుగులతో నాలుగో స్థానంలో నిలిచాయి. ఎద్ల యజమానులకు వరుసగా రూ.20వేలు, రూ.15, రూ.10 రూ.5వేలు నగదు బహుమతులు అందజేశారు. అనంతరం మధ్యాహ్నం నుంచి నిర్వహించిన పోటీల్లో తలపూరుకు చెందిన అరవింద నాయుడు ఎద్లు 2098 అడుగులతో ప్రథమ, ప్రొద్దుటూరుకు చెందిన ద్వార్శల గురివిరెడ్డి ఎద్లు 2046.1 అడుగులతో ద్వితీయ, నంద్యాల జిల్లా పీఆర్ పల్లెకు చెందిన బయపురెడ్డి ఎద్లు 1665.5 అడుగులతో తృతీయ, నెల్లూరు జిల్లా రామనపాలెంకు చెందిన బుల్స్ మధురెడ్డి ఎద్ల నాలుగో, నరసింహారెడ్డి ఐదవ, కడప జిల్లా దువ్వూరుకు చెందిన బాలపేరెడ్డి ఎద్లు ఆరవ, ఒంగోలు లైవ్ మిథున్‌రెడ్డి ఎద్ల ఏడవ స్థానంలో నిలిచాయి. రూ.15 రూ.10, రూ.6, రూ.5, రూ. 2వేల చొప్పున బహుమతులను అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు.



సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం



ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి



బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

క్లుప్తంగా

నరసింహస్వామికి స్వాతి నక్షత్ర పూజలు



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహుడు

ప్రొద్దుటూరు కల్చరల్ : మండల పరిధిలోని నరసింహాపురం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం స్వామి జన్మనక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున పంచామృతాభిషేకం, కుంకుమార్చలను నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల మూలవిరాట్‌లను నూతన వస్త్రాలు, గజమాల, ఆభరణాలతో అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేసి తమ మొక్కులను తీర్చుకున్నారు. భక్తులకు మధ్యాహ్నం అన్న ప్రసాద వినియోగం జరిగింది.

ఘనంగా సీతారాముల కల్యాణం



సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

బ్రహ్మంగారిమఠం : మండలంలోని దిరసవంచ పంచాయతీ చౌటపల్లె గ్రామంలో మూడురోజులుగా జరుగుతున్న ధ్వజ, శిఖర, ప్రతిష్ట మహోత్సవాల్లో భాగంగా చివరిరోజు ఆదివారం ధ్వజస్తంభం ఏర్పాటు, సీతారాముల కల్యాణం నిర్వహించారు. రాత్రికి గ్రామోత్సవం నిర్వహించారు. ఉత్సవాలను తిలకించేందుకు పలువురు నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

ఘనంగా పంచముఖుని వార్షికోత్సవం



పూజాకార్యక్రమంలో పంచముఖ ఆంజనేయస్వామి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక పెన్నానదీ తీరంలోని శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం ఆలయ 42వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. వేకువజామున స్వామివారి మూలవిరాట్, ఉత్సవమూర్తికి విశేష అభిషేకాలు, అర్చనలు చేసి ప్రత్యేకంగా పూలతో, వెండి కవచాలతో, సుందరంగా అలంకరించారు. మధ్యాహ్నం భక్తులకు తీర్థప్రసాద వినియోగం జరిగింది. కార్యక్రమంలో టీటీడీ బోర్డు మెంబరు టంగుటూరు మారుతి ప్రసాద్, ఎం.సేతురావు, బాబు, రావుశ్రీ, ధారా సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గోరిస్వామి ఉరుసు మహోత్సవం

దువ్వూరు : పాత దువ్వూరులోని గోరి స్వామి ఉరుసు మహోత్సవాలు 13న సోమవారం నుంచి 15వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు దర్గా కమిటీ వారు తెలిపారు. 13న గంధం, 14న ఉరుసు మహోత్సవం, 15న తహలీల్ ఫాతిహా నిర్వహిస్తున్నట్లు వారు వివరించారు. 14, 15న అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశామని, ఉత్సవాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొనాలని కోరారు.

హజ్ హౌస్ పరిరక్షణకు చర్యలు చేపట్టాలి

కడప రూరల్ : కడప నగర శివార్లలో నిర్మించిన హజ్ హౌస్ పరిరక్షణకు చర్యలు చేపట్టాలని ముస్లిం సంఘాల నేతలు కోరారు. ఆదివారం స్థానిక ఏకే ఫంక్షన్ హాలులో సంఘ సేవకులు సయ్యద్ సలావుద్దీన్ ఆధ్వర్యంలో హజ్‌హౌస్ పరిరక్షణ కమిటీ ఏర్పాటు కోసం ముస్లిం సంఘాల ప్రతినిధులతో రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. 2019లో రూ. 26 కోట్లతో హజ్ హౌస్‌ను నిర్మించారన్నారు. రాయ లసీమ జిల్లాలతోపాటు నెల్లూరు, ప్రకాశం జి ల్లాలకు కేంద్రంగా ఇక్కడ హజ్ హౌస్ ఏర్పడిందన్నారు. కడప ఎయిర్‌పోర్టును అంతర్జాతీయ ఎయిర్‌పోర్టుగా తీర్చిదిద్ది పవిత్రహజ్ యాత్ర ఇక్కడి నుంచే కొనసాగేలా చర్యలు చేపట్టాలన్నారు. అరబ్ దేశాలలో ఉపాధి పొందుతున్న రాయలసీమ వాసులకు ప్రయోజనకరంగా ఉంటుందన్నారు.

ఎస్ఆర్ఐటీ అధ్యాపకురాలికి డాక్టరేట్



లెక్కల పద్మావతి

కడప ఎడ్యుకేషన్: సాయిరాజేశ్వరి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజనీరింగ్ కళాశాలలో మ్యాథమేటిక్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న లెక్కల పద్మావతికి అనంతపురం జేఎన్‌టీయూ వారు డాక్టరేట్‌ను ప్రదానం చేశారు.

నేడు కో–ఆపరేటివ్ స్టోర్స్ పాలకవర్గం ప్రమాణ స్వీకారం

ప్రెసిండెంట్‌గా గజ్జల కళావతి



ప్రొద్దుటూరు : ది ప్రొద్దుటూరు సెంట్రల్ కన్సూమర్స్ కో–ఆపరేటివ్ స్టోర్స్ లిమిటెడ్ (సూపర్‌బజార్) పాలకవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారం కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 10 గంటలకు కార్యాలయంలో నిర్వహించనున్నారు. పాలకవర్గ సభ్యుల స్థానాలకు సంబంధించి పోటీలో ఉన్న అభ్యర్థులందరూ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రమాణ స్వీకారం అనంతరం స్టోర్స్ అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎన్నిక జరుగనుంది. ప్రెసిడెంట్‌గా వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ అధ్యక్షురాలుగా పనిచేస్తున్న గజ్జల కళావతిని నియమించనున్నట్లు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ఇదివరకే ప్రకటించారు. పాలక వర్గం సభ్యులుగా గజ్జల కళావతి, వెల్లాల వినోద్‌కుమార్‌రెడ్డి, బద్రి లక్ష్మీరంగారెడ్డి, వి.శివశంకర్‌రెడ్డి, నల్లబోతుల సుబ్బరాయుడు, సి.రంగనాయకులు, పి.సురేంద్రనాథ్‌రెడ్డి, మంచాల మదన్‌కుమార్, ఎస్.మహ్మద్ షబ్బీర్, ఎన్.శ్రీరాములు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించేందుకు వైఎస్సార్‌సీపీ నాయకులు అన్ని ఏర్పాట్లు చేశారు.

ఆదాయ పన్ను నిబంధనలు సవరించాలి

ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శేఖర్

కడప ఎడ్యుకేషన్: ఆదాయ పన్ను నిబంధనలను ప్రభుత్వం సరళతరం చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శేఖర్ కోరారు. ఆదివారం కడపలోని ఏపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆదాయపన్ను రిటర్న్స్‌పై అధికారులు ఉపాధ్యాయులపై ఒత్తిడి తగ్గించాలని ఈనెల 25వ తేదీ వరకు గడువు ఇవ్వాలని కోరారు. వివిధ రకాల సమస్యలతో ఆదాయపన్ను రిటర్న్స్ దాఖలు చేయడంతో ఆలస్యం జరుగుతున్న వారికి మినహాయింపు ఇవ్వాలన్నారు. ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సీవీ ప్రసాద్ మాట్లాడుతూ ఇంటి అద్దె మినహాయింపులు కోసం ఆదాయ పన్ను శాఖ నిర్దేశించిన రెండవ సూత్రం వల్ల ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. దీనిని సవరించాలని డిమాండ్ చేశారు.

రామస్వామికి ఘన నివాళి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక ఉపాధ్యాయ సేవా కేంద్రంలో ఆదివారం ఆర్‌జేయూపీ ముఖ్య సలహాదారుడు దివంగత కె.రామస్వామి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. రామస్వామి ఆశయాల సాధనకు ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు కృషి చేయాలని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌జేయూపీ రాష్ట్ర గౌరవ సలహాదారుడు ముత్తోజు వీరబ్రహ్మం, నేతాజి సోషియల్ క్లబ్ ప్రతినిధి భాస్కర్‌రావు, ఎస్ఎల్‌టీఏ నాయకులు మధు, శేఖర్, సుధాకర్, ఓబుళరెడ్డి, మధుసూదన్ పాల్గొన్నారు.



రామస్వామి చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఒంటేరు శ్రీనివాసులరెడ్డి

వృద్ధులకు అన్నదానం

ప్రొద్దుటూరు : ఏపీఈఈయూ 1104 యూనియన్ 74వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా ఆదివారం యూనియన్ నాయకులు పట్టణంలో యాజకులు, వృద్ధులకు, నిస్సహాయకులకు మధ్యాహ్నం ప్రాణదాత సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో డిస్కమ్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, రీజనల్ కార్యదర్శి వై.కృష్ణమూర్తి, రీజనల్ ప్రెసిడెంట యూఎస్‌కే బర్నబాస్, డివిజనల్ ప్రెసిడెంట్ సి.మాధవ, డివిజనల్ సెక్రటరీ ఎస్.షరీఫ్, డివిజనల్ కార్యనిర్వాహక అధ్యక్షుడు ఉమామహేశ్వరరావు, డివిజనల్ సహాయ కార్యదర్శి వి.రమేష్, డివిజనల్ సలహాదారు ఎస్‌ఏ గఫూర్, డివిజనల్ మాజీ ప్రెసిడెంట్ జయకృష్ణ, యూని యన్ సభ్యులు నారాయణ రెడ్డి, మునయ్య, లాయర్ సుమంత్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రికల్ వర్కర్ల సమస్యల పరిష్కారానికి కృషి

కడప కార్పొరేషన్: జిల్లాలోని ఎలక్ట్రికల్ వర్కర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని జిల్లా ప్రైవేటు ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పవర్ అల్తాఫ్ అన్నారు. ఆదివారం వేంపల్లి అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఎలక్ట్రికల్ వర్కర్ల సమస్యల గూర్చి చర్చించారు. ఈ సందర్భంగా పవర్ అల్తాఫ్ మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా ఎలక్ట్రికల్ వర్కర్లకు రావాల్సిన పథకాలు, బీఓసీ కార్డుల కోసం కృషి చేస్తామని తెలిపారు. జిల్లా కార్యదర్శి సుజాన్, కోశాధికారి ప్రసాద్, వేంపల్లి అధ్యక్షుడు ముని, ప్రధాన కార్యదర్శి గౌస్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం విజయవంతం

మైదుకూరు : మండలంలోని వనిపెంటలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. స్థానిక జెడ్పీ హైస్కూల్ ఆవరణలో మైదుకూరులోని ఎస్ఎల్ఆర్ ఆస్పత్రి వారు ఏర్పాటు చేసిన శిబిరాన్ని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్యం అందించడం అభినందనీయమన్నారు. శిబిరంలో ఆస్పత్రి ఎండీ డాక్టర్ మూలె రామ అనిల్‌కుమార్‌రెడ్డి 180 మందికి వైద్య పరీక్షలు, రూ.3,500 విలువైన ఈసీజీ, స్కాన్ పరీక్షలు చేసి మందులు అందజేశారు. మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీమన్నారాయణరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ మూలె సుధాకర్‌రెడ్డి, సర్పంచ్ గౌస్ లాజం, ఎంపీటీసీ ఇర్షాద్, వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి ఇడగొట్టు శేషు, అబ్దుల్ కలాం, రియాజ్ పాల్గొన్నారు.



వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

మహిళకు రక్తదానం

పోరుమామిళ్ల : స్థానిక ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేరిన మహిళకు అర్ధరాత్రి రక్తం అవసరమవగా రైట్ హ్యాండ్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకులు నాయబ్‌రసూల్ సహాయం చేశారు. కలసపాడు మండలం నల్లగొండుపల్లెకు చెందిన తులసి శనివారం రాత్రి ఆసుపత్రిలో చేరగా ఆమె చికిత్సకు ఓ పాజిటివ్ రక్తం కావాలని వైద్యులు తెలిపారు. అర్ధరాత్రి రక్తం ఎవరిస్తారో తెలియనిస్థితిలో ఆమె బంధువులు రైట్ హ్యాండ్ ఆర్గనైజేషన్ గురించి తెలిసి నాయబ్‌రసూల్‌ను సంప్రదించారు. వెంటనే రసూల్ వనిపెంట రామయ్యతో రక్తం ఇప్పించి ఆదుకున్నారు.

200 మందికి ఉచిత వైద్య పరీక్షలు

బ్రహ్మంగారిమఠం : మల్లేపల్లెలో ఆదివారం కడపకు చెందిన సన్‌రైజ్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్వాకులు డాక్టర్ అంకిరెడ్డిపల్లె విజయభాస్కర్‌రెడ్డి, ఆయన భార్య డాక్టర్ రమ్యతారెడ్డి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో పలు గ్రామాల నుంచి వచ్చిన 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ సన్‌రైజ్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం ఏదో ఒక గ్రామంలో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేస్తున్నామన్నారు. వివిధ రకాల వ్యాధులతో వచ్చిన వారికి పరీక్షలు చేసి ఉచితంగా మందులు ఇస్తామన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి వైద్య సిబ్బంది, జెడ్పీ ఉన్నత పాఠశాల కమిటీ చైర్మన్ లెక్కల రమేష్‌రెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



రోగులకు వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్లు విజయభాస్కర్‌రెడ్డి, రమ్యతారెడ్డి

14న ఆర్టీసీ ఆర్ఎం కార్యాలయం వద్ద ఆందోళన

కడప వైఎస్ఆర్ సర్కిల్: ఆర్టీసీ బస్టాండ్లను ప్రైవేట్ సంస్థలకు లీజుకు కట్టబెట్టాలనే ప్రయత్నాలను నిరసిస్తూ ఆర్టీసీ ఆర్ఎం కార్యాలయం వద్ద ఈ నెల 14న ఆందోళన చేపట్టనున్నట్లు సీపీఎం నగర కార్యదర్శి రామ్మోహన్ పేర్కొన్నారు.

ఘనంగా శాంతియాత్ర

ప్రొద్దుటూరు కల్చరల్ : మహాశివ రాత్రి పర్వదిన వేడుకల్లో భాగంగా ఆదివారం స్థానిక వైఎంఆర్ కాలనీ ఓంశాంతి నగర్ నుంచి శివలింగ దర్శన శాంతి యాత్రను నిర్వహించారు. శివలింగాలకు ప్రత్యేక పూజలను చేశారు. ఓం శాంతీలు శివలింగ విగ్రహాలను పుర వీధుల్లో శివనామస్మరణల మధ్య ఊరేగించారు. సమస్త మానవాళిలో ఒత్తిడి, అశాంతి, దుఖం తొలగిపోయి ఆనందోత్సాహాలతో జీవించాలని ఈ శాంతి యాత్ర చేపట్టినట్లు ఓంశాంతీ భవన్ నిర్వాహకులు హేమ బెహన్‌జీ, శివలక్ష్మి బెహన్‌జీ, కృష్ణవేణి బెహన్‌జీ తెలిపారు. పాఠశాల విద్యార్థులు, ఓం శాతీలు, బ్రహ్మకుమారీలు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



వాహనంపై శివలింగాన్ని ఊరేగిస్తున్న దృశ్యం



శివలింగాలతో శాంతి యాత్రలో పాల్గొన్న బ్రహ్మకుమారీలు

14నుంచి జీవధార ధ్వజస్తంభ ప్రతిష్టాపన

బ్రహ్మంగారిమఠం : శ్రీపోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామి మఠంలో దాదాపు 100 ఏళ్ల నాడు ప్రతిష్టించబడిన ధ్వజస్తంభం దెబ్బతినడంతో తిరిగి నూతన ధ్వజస్తంభం ఏర్పాటు చేయనున్నారు. ఈనెల 14 నుంచి 16 వరకు జీవధార ధ్వజస్తంభ ప్రతిష్ట మహోత్సవం నిర్వహిస్తునట్లు మఠం మేనేజర్ ఈశ్వరాచారి ఆదివారం తెలిపారు. పూర్వ మఠాధిపతులు వీరభోగవసంత వెంకటేశ్వరస్వామి ఉన్నపుడే ధ్వజ స్తంభం మార్చాలని సకల్పించారు. ఇప్పటికి కార్యరూపం దాల్చిందన్నారు. మఠం పిట్‌పర్సన్, ఎండోమెంట్ ఏసీ శంకర్‌బాలాజీ ఆధ్వర్యంలో పూర్వపు మఠాధిపతుల కుమారులు, వారి ధర్మపత్ని మారుతీ మహాలక్షుమ్మ సమక్షంలో ఈ మహోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. ధ్వజస్తంభం శాశ్వత దాతలు కలసపాడు మండలం ఎగువ తంబళ్లపల్లె గ్రామస్తులు గంగ సాని వంశస్తులచే ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

మహిళల సమస్యలను పరిష్కరించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: జిల్లాలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను పాలక ప్రభుత్వాలు పరిష్కరించాలని ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బషీరున్నీషా డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని శంకరాపురంలో నిర్వహించిన ఏపీ మహిళా సమాఖ్య జిల్లా సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళలకు చట్ట సభల్లో 33 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇందు కోసం పార్లమెంట్‌లో చట్టం తీసుకురావాలన్నారు. అనంతరం నూతన కమిటీ ఎన్నుకున్నారు. ఏపీ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలిగా విమల, కార్యదర్శిగా వెంకట రమణమ్మ, సహాయ కార్యదర్శిగా రమాదేవితో పాటు పలువురిని ఎన్నుకున్నారు.